సాక్షి నిజామాబాద్

బుధవారం ၊ 28 ၊ ఫిబ్రవరి ၊ 2024



దర్జీ బతుకుల్లో దర్జా కరువు

రెడీమేడ్ దుస్తుల రాకతో దర్జీల బతుకుల్లో దర్జా కరువైంది. ఉపాధి కరువవడంతో దుకాణాలు కనుమరుగవుతున్నాయి.

- 8లో ▸



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

33.6 /21.3

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలితీవ్రత కొనసాగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇండియా బుక్ ఆఫ్ రికార్డు కోసం మహిళలకు శిక్షణ



ఖలీల్‌వాడి: మహిళలు స్వీయ రక్షణ శిక్షణలో భాగంగా మార్చి 2న 10వేల మందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి సునీత కుంచాల తెలిపారు. ఇందుకోసం మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మహిళలకు తైక్వాండో శిక్షణను ప్రారంభించారు. అనంతరం జిల్లా జడ్జి మాట్లాడుతూ మార్చి 2న గిరిరాజ్ కాలేజీలో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ కోసం 10 వేల మంది మహిళలతో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కల్మేశ్వర్, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, ఆర్‌సీఐ రమేశ్, తైక్వాండో కార్యదర్శి కె.మనోజ్ కుమార్, పోలీస్ శాఖ సిబ్బంది, ఫారెస్ట్ శాఖ సిబ్బంది, హెల్త్ డిపార్ట్‌మెంట్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 5 నుంచి జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

■ జెడ్పీ సీఈవో ఉష వెల్లడి

నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను మార్చి 5 నుంచి నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో ఉష మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 5న ఉదయం 11 గంటలకు వ్యవసాయం, మధ్యాహ్నం 2 గంటలకు గ్రామీణాభివృద్ధిపై సమావేశాలు ఉంటాయన్నారు. మార్చి 6న ఉదయం 11 గంటలకు విద్య, వైద్యం, మధ్యాహ్నం 2 గంటలకు మహిళ, శిశు సంక్షేమ శాఖపై, మార్చి 7న ఉదయం 11 గంటలకు సాంఘిక సంక్షేమ శాఖ, మధ్యాహ్నం రెండు గంటలకు పనులు, ఆర్థిక ప్రణాళికపై సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. సమావేశాలకు సంబంధిత అధికాకారులు హాజరు కావాలని ఆమె కోరారు.

వర్సిటీల అభివృద్ధికి గ్రాంట్లు విడుదల చేయాలి

■ రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలో యూనివర్సిటీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్లు విడుదల చేయాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. మంగళవారం వర్సిటీని ఆకునూరి మురళి, తెలంగాణ ప్రజాస్వామ్య వేదిక నాయకులు సందర్శించారు. వర్సిటీలోని సదుపాయాలను అసిస్టెంట్ ప్రొఫెసర్ పున్నయ్యను అడిగి తెలుసుకున్నారు. వర్సిటీలో సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీల్లో మరిన్ని కోర్సులను రెగ్యులర్ ఫ్యాకల్టీలను నియమించాలన్నారు. వర్సిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి, నిరుద్యోగ సమస్యలపై అవగాహన కల్పించేందుకు మార్చి 12న తెలంగాణ వర్సిటీలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, పద్మజ, జానయ్య, జాగో తెలంగాణ నాయకురాలు నిర్మల, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, వర్సిటీ నాయకులు రవీందర్, అక్షయ్, హన్మండ్లు తదితరులున్నారు.

టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. మంగళవారం పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రశ్నాపత్రాలు, ఇన్విజిలేటర్లకు కేటాయింపు సక్రమంగా ఉండాలన్నారు. హాల్ టికెట్లలో ఏవైనా పొరపాట్లు జరిగితే తక్షణమే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. సెల్‌ఫోన్‌లు పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. అనంతరం డీఈవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రతి ఒక్కరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. సెంటర్లలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ పరీక్షలు నిర్వహణ అధికారి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

601 ఉపాధ్యాయ ఖాళీలు



135	434
స్కూల్ అసిస్టెంట్	ఎస్జీటీ
23	**09**
లాంగ్వేజ్ పండిట్	పీఈటీ

- జిల్లాలో పెరిగిన టీఆర్‌టీ పోస్టులు
- ఈసారి కొత్తగా స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు 42 మంజూరు
- త్వరలో మెగా డీఎస్సీ ప్రకటించే అవకాశం

నిజామాబాద్‌అర్బన్: టీచర్ కొలువులకు సంబంధించిన పోస్టులు జిల్లాలో పెరిగాయి. గతంలో మంజూరైన టీఆర్‌టీ(టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) పోస్టులను రెట్టింపు చేస్తూ తాజాగా అనుమతులు జారీ చేసింది. దీంతో జిల్లాలో నిరుద్యోగులకు ఊరట లభించినట్లయ్యింది. 2017లో నిర్వహించిన టీఆర్‌టీ తర్వాత ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించలేదు. దీంతో టెట్ ఉత్తీర్ణత సాధించిన వేలమంది అభ్యర్థులు టీఆర్‌టీ కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఎట్టకేలకు టీచర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు పరీక్ష నిర్వహణకు షెడ్యూల్‌ను సెప్టెంబర్‌లో విడుదల చేయడంతో ఊపిరిపించుకున్నారు. పరీక్షతేదీని కూడా ప్రకటించారు. కానీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో వాయిదా పడింది. ప్రస్తుతం ఏర్పడిన కొత్త ప్రభుత్వం పోస్టుల సంఖ్యను పెంచి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. దీంతో జిల్లాలో పోస్టుల సంఖ్య పెరిగింది.

పెరిగిన పోస్టులు

జిల్లాలో గత ప్రభుత్వం 309 పోస్టులు ప్రకటించి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. కానీ ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా నిలిచిపోవడంతో.. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం పోస్టులను 601కి పెంచింది. అంతేకాకుండా తొలిసారిగా స్పెషల్ ఎడ్యూకేషన్ కింద 43 పోస్టులు మంజూరు చేసింది. ఈ పోస్టులు ఎస్ఏ, ఎస్జీటీ ఖాళీల్లోనే కలిపి చూపించారు. దీనికి ప్రత్యేక బీఈడీ పూర్తి చేసినవారు అర్హులవుతారు. ఇందులో సోషల్ స్టడీస్ ప్రభుత్వ విభాగంలో రెండు పోస్టులు, లోకల్‌బాడీ విభాగంలో తొమ్మిది పోస్టులు ఉన్నాయి. ఎస్జీటీ విభాగంలో తెలుగులో నాలుగు, లోకల్‌బాడీ విభాగంలో 24, ఉర్దూ విభాగంలో ప్రభుత్వంలో ఒకటి, లోకల్‌బాడీ విభాగంలో రెండు పోస్టులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో స్కూల్‌అసిస్టెంట్ పోస్టులు 96, ఎస్జీటీలు 183, లాంగ్వేజ్ పండిట్‌లు 21 ఉన్నాయి. కానీ పీఈటీ పోస్టులు గతంలో తొమ్మిది ఉండగా ప్రస్తుతం అంతే ఉన్నాయి.

తీవ్రపోటీ

గతంలో కంటే పోస్టులు పెంచినా వివిధ విభాగాల్లో పోటీ తీవ్రంగానే ఉండనుంది. 2017 నుంచి డీఎస్సీ నిర్వహించపోవడం ఇందుకు ప్రధాన కారణం. ఇటీవల గురుకుల పోస్టులు భర్తీ అయినా చాలామంది డీఎస్సీపైనే దృష్టి సారిస్తారు. కాగా కొన్నేళ్లుగా టెట్ ఉత్తీర్ణులైన వారు డీఎస్సీ కోసం ఎంతో ఎదురుచూస్తున్నారు. జిల్లాలో టెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు పేపర్-1లో 4,880 మంది, పేపర్-2లో 5,383 మంది ఉన్నారు. అంతేగాక గతేడాది సెప్టెంబర్‌లో కూడా మరోసారి టెట్ నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణులైన వారు సైతం ఈ పరీక్షకు హాజరుకానున్నారు. 601 పోస్టులకు గాను సుమారు 25వేల మంది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. సబ్జెక్టుల వారీగా ఖాళీలను పరిశీలిస్తే ఒక్కొక్క పోస్టుకు తీవ్ర పోటీ ఉండనుంది.

పోస్టులు మరిన్ని పెంచాలి



టీఆర్‌టీలో పోస్టుల సంఖ్య పెంచాలి. ఖాళీలు ఉ న్నా భర్తీ చేయడంలేదు. అభ్యర్థులు ఎక్కువగా ఉ న్నారు. అందుకే మరిన్ని పోస్టులు పెంచాలి. ప్ర భుత్వ పాఠశాలలో ఉన్న టీచర్ల కొరత తీరుతుంది.

– రజిత అభ్యర్థి

ఆటంకాలు లేకుండా నిర్వహించాలి



ప్రభుత్వం ఈ సారైనా ఆటంకాలు లేకుండా టీఆర్‌టీని నిర్వహించాలి. కొన్నేళ్లుగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దు. అభ్యర్థులను మోసం చేయవద్దు. – జన్నారపు రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- పరీక్షలు రాయనున్న 35,346 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- జిల్లా ఇంటర్ అధికారి రఘురాజ్



నగరంలోని ఓ పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు మార్చి 19వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని 57 కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి. ఇందులో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, రెండు ఎయిడెడ్, రెండు సాంఘిక సంక్షేమ కళాశాలలు, ఆరు మోడల్, రెండు మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలు, ఒక బీసీ సంక్షేమ, 26 ప్రైవేటు కళాశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఒక ప్రైవేటు పాఠశాలల్లో ఎగ్జామ్స్ నిర్వహణ కోసం ఏర్పాట్లు చేశారు. అయితే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8.30 గంటల వరకు చేరుకోవాలని డీఐఈవో రఘురాజ్ తెలిపారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్ నివారణకు మూడు సిట్టింగ్, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు పరీక్షలను పర్యవేక్షిస్తామని చెప్పారు.

ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లతో సమావేశం

పరీక్షల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించేందుకు మంగళవారం డీఐఈవో తన కార్యాలయంలో ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో సమావేశం నిర్వహించారు. బృందాలు ప్రతిరోజూ జిల్లాలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తారన్నారు. విద్యార్థుల వద్ద చీటీలు లభిస్తే మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేయాలన్నారు.

పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులు

ఫస్టియర్ జనరల్	14,965
ఒకేషనల్	2,399
సెకండియర్ జనరల్	13,986
ప్రైవేటు	1,804
సెకండియర్ ఒకేషనల్	1,999
ప్రైవేటు	193
మొత్తం విద్యార్థులు	35,346

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



భిక్కనూరు: పెళ్లికావడం లేదని మనస్తాపం చెంది ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. భిక్కనూరు రెండో ఎస్సై రాంచందర్‌నాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన కోడూరి శ్రీకాంత్‌గౌడ్(32) చిన్నతనంలోనే తండ్రి సిద్దరాములుగౌడ్ చనిపోయాడు. యుక్తవయసు వచ్చాక కుటుంబ పోషణ కోసం గల్ఫ్ వలస వెళ్లాడు. అక్కడ పనిచేస్తూ ఇద్దరు చెల్లెళ్ల వివాహం జరిపించాడు. సొంతింటి కల నెరవేర్చుకున్నాడు. కొన్నాళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. పెళ్లి కుదరకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం తల్లి నర్సవ్వను బయటకు పంపించి ఇంట్లోకి వెళ్లి తలుపులకు గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. బయటకు వెళ్లిన నర్సవ్వ చుట్టుపక్కల వారిని పిలుచుకుని వచ్చి ఇంటి గడియను తెరిపించి లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేళాడుతూ శ్రీకాంత్‌గౌడ్ మృతదేహం కనిపించింది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

వైద్యారోగ్యశాఖలో మళ్లీ డిప్యుటేషన్లు!

- ఇప్పటికే కలెక్టర్ వద్దకు చేరిన ఫైల్
- తనకు అనుకూలంగా ఉన్నవారి పేర్లు చేర్చినట్లు చర్చ

నిజామాబాద్‌నాగారం: వైద్యారోగ్యశాఖలో డిప్యుటేషన్ల అంశంపై మళ్లీ తెరపైకి వచ్చింది. వైద్యారోగ్యశాఖ సెక్రెటరీ క్రిస్టినా జడ్‌చోంగ్తూ డిప్యూటేషన్లు రద్దు చేసి పక్షం రోజులు గడవముందే.. డిప్యుటేషన్లు కావాలంటూ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సుమారు 70 మంది జాబితాను కలెక్టర్ అనుమతి కోసం పంపించినట్లు సమాచారం. అనుమతి రాకముందే ఉద్యోగుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు శాఖలో చర్చించుకోవడం గమనార్హం.

కలెక్టర్ వద్ద 70 మందితో కూడిన జాబితా

జిల్లా వైద్యారోగ్యశాఖలో డిప్యుటేషన్లు రద్దయిన విషయం తెలిసిందే. దీంతో డిప్యుటేషన్లపై ఇతర జిల్లాల నుంచి వచ్చినవారు సొంత జిల్లాకు వెళ్లారు. ఇతర జిల్లాలో ఉన్న వారు మన జిల్లాకు వచ్చారు. కానీ ఇటీవల వైద్యరోగ్యశాఖ పరిధిలో చాలాపోస్టులు ఖాళీగా ఉన్నాయని, కచ్చితంగా డిప్యుటేషన్లు అవసరముందని అధికారులు సుమారు 70 మందికిపైగా కూడిన జాబితాను సిద్ధం చేశారు. ఫైల్‌ను వారం క్రితమే కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు పంపించారు. కలెక్టర్ అనుమతి ఇస్తే డిప్యూటేషన్లు జరిగే అవకాశం ఉంది. అయితే ఈ జాబితాలో పాత వారి పేర్లే ఉండడం గమనార్హం.

వసూళ్లపై చర్చ

గతంలో డిప్యూటేషన్లకు సంబంధించిన అధికారం జిల్లా వైద్యరోగ్యశాధికారులకే ఉండేది. దీనిని కొందరు అధికారులు దుర్వినియోగం చేయడంతో రాష్ట్ర వైద్యరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ డిప్యూటేషన్లను రద్దు చేశారు. అత్యవసరమైతే కలెక్టర్ అనుమతి తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఇది కొంతమంది అధికారులకు మింగుపడడం లేదు. ఎలాగైనా డిప్యుటేషన్లు తెచ్చుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది మామూళ్లు ముట్టజెప్పారనే చర్చ జోరుగా సాగుతోంది.

కలెక్టర్‌కు ఫైల్ పంపించాం

జిల్లాలో డిప్యూటేషన్లు రద్దయ్యాయి. కానీ ఖాళీలు ఉండడంతో పనులు పెండింగ్‌లో పడుతున్నాయి. అందుకే డిప్యుటేషన్లు అవసరముందని కలెక్టర్‌కు 70 మందితో కూడిన జాబితాను పంపించాం. కలెక్టర్ అనుమతి వస్తే డిప్యుటేషన్లు ఇస్తాం.

– డాక్టర్ సుదర్శనం, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

రికార్డుల్లో తేడా వస్తే చర్యలు తప్పవు



రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో తరుణ్

వర్ని: పంచాయతీ రికార్డుల్లో తేడా వస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి త రుణ్ హెచ్చరించారు. మంగళవారం వర్ని మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీపీలోని రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ, పంచాయతీ పనుల్లో రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి ఉంచాలని పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఆయ న వెంట డివిజనల్ పంచాయతీ అధికారి సాయిబాబా, ఎంపీవో చందర్ నాయక్ ఉన్నారు.

మోదీయే దేశానికి శ్రీరామరక్ష



ధర్పల్లిలో నిర్వహించిన యాత్రలో పాల్గొన్న ప్రజలు



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

- రాష్ట్రంలో 15 ఎంపీ స్థానాలు గెలుచుకుంటాం
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

కమ్మర్‌పల్లి/భీమ్‌గల్/ధర్పల్లి/జక్రాన్‌పల్లి/సిరికొండ/ఆర్మూర్: దేశానికి ప్రధాని నరేంద్ర మోదీయే శ్రీరామ రక్ష అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. దేశానికి స్వాతంత్ర్య సిద్ధించి 2047 నాటికి వందేళ్లు అవుతుందని, అప్పటిలోగా ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో భారత దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలన్నదే ఆయన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమం, దేశభద్రత, అవినీతి రహిత సమాజం మోదీతోనే సాధ్యమని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర మంగళవారం జిల్లాలో కొనసాగింది. జిల్లాలో కమ్మర్‌పల్లి నుంచి ప్రారంభమైన యాత్ర భీమ్‌గల్, ధర్పల్లి, జక్రాన్‌పల్లి, సిరికొండ మండలాల మీదుగా ఆర్మూర్ వరకు సాగింది. యాత్రలో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ రాష్ట్రంలో 15 ఎంపీ స్థానాలు భారీ మెజారిటీతో కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ మోదీ ప్రధాని అయితే రైతులకు సబ్సిడీలు, పేదలకు ఉచిత బియ్యం వస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో రూ. వేల కోట్ల కేంద్ర నిధులతో అభివృద్ధి పనులు జరిగాయని, మరెన్నో పనులు కొనసాగుతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అర్వింద్‌ను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. దేశాన్ని మోదీ ప్రణాళికబద్ధంగా ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. ప్రపంచ దేశాలన్నీ మోదీ నాయకత్వం వైపు చూస్తున్నాయన్నారు.

ఆర్మూర్ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ మంత్రులు దోచుకుంటున్న తీరును బట్టబయలు చేస్తామన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించి మరోమారు మోదీని ప్రధానిని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గద్దె భూమన్న, పల్లె గంగారెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కర్క గంగారెడ్డి, మహిపాల్, రాజేశ్వర్, పెద్ద కొండయ్య, కిషన్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్, పోశన్న, కొప్పు రాజేందర్, అశోక్, దినేశ్ పాల్గొన్నారు.

పసుపునకు రూ.20వేల ధరపై బాండ్ రాసిస్తా



మాట్లాడుతున్న అర్వింద్

ఆర్మూర్: గత ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని బాండ్ పేపర్ రాసి ఇచ్చి నెరవేర్చానని ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. ఈ సారి పసుపు క్వింటాలు పసుపునకు రూ.20 వేల ధర ఇప్పిస్తానని బాండ్ పేపర్ రాసి ఇస్తానని ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్‌లో పసుపు బోర్డు ఏర్పాటుకు ఉత్తర్వులు జా రీ చేసినా కాంగ్రెస్ నాయకులు ఇప్పటికీ రాజకీ యం చేస్తున్నారన్నారు. ఏడాదిలో పసుపు బోర్డు జిల్లా కేంద్రంగా ఏర్పాటవుతుందన్నారు. దేశంలో రామరాజ్యం రావాలంటే మరోసారి బీజేపీకే ఓటు వేయాలని పేర్కొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలు అని స్పష్టమైందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతున్నా ఆరు గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బాల్కొండ ఇన్‌చార్జి ఏలేటి మల్లికార్జున్ రెడ్డి సమక్షంలో మెండోరా ఎంపీటీసీ ఆరే లావణ్య బీజేపీలో చేరారు. కమ్మర్‌పల్లి మండలానికి చెందిన 40 మంది యువకులు వీరి సమక్షంలో బీజేపీలో చేరారు.

వచ్చేనెల 1 నుంచి గృహజ్యోతి అమలు

- 200 యూనిట్లలోపు వారికి జీరో బిల్లు
- ప్రతినెలా ప్రభుత్వంపై రూ. 25 కోట్ల భారం

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు తీపి కబురు చెప్పింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి అమలు చేయనున్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లాలో వినియోగదారులకు మార్చి 1 నుంచి జీరో బిల్లు రానుంది. దీంతో ప్రతి నెలా రూ. 25 కోట్ల భారం పడనుంది.

4.02 లక్షల మందికి అనుమతి

జిల్లాలో బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ డివిజన్, నిజామాబాద్ రూరల్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో జిల్లా వ్యాప్తంగా 4.69 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 15 రోజుల పాటు విద్యుత్ సిబ్బంది ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, మీటర్ నంబర్‌ను నమోదు చేసుకున్నారు. ఇందులో జిల్లాలో 4.02 లక్షల మంది అర్హులున్నట్లు అధికారులు జాబితా సిద్ధం చేశారు.

దరఖాస్తుకు అవకాశం

జిల్లాలో 4.02 లక్షల మందికి మార్చి 1 నుంచి జీరో బిల్లు రానుంది. ఇందులో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడిన వినియోగదారులకు గృహజ్యోతి అమలు కానుంది. 200 యూనిట్లలోపు వాడిన వారికి జీరో బిల్లు వస్తుంది. ఈ డబ్బులను ప్రభుత్వం విద్యుత్ సంస్థకు చెల్లిస్తుంది. ఉచిత విద్యుత్ కారణంగా ప్రభుత్వంపై ప్రతినెలా సుమారుగా రూ. 25 కోట్లు భారం పడనుంది. రేషన్‌కార్డు ఉండి ఎవరైనా దరఖాస్తు చేసుకోనట్లయితే సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

మార్చి 1 నుంచి రీడింగ్

మార్చి 1 నుంచి స్పాట్‌బిల్లర్స్ ఇంటింటికి తిరిగి విద్యుత్ బిల్లులకు సంబంధించి రీడింగ్ తీయనున్నారు. జిల్లాలో 4.02 లక్షల మందికి 200 యూనిట్ల లోపు అర్హులు ఉన్నారు. బిల్లులు తీసే సమయంలో 200లోపు యూనిట్లు వినియోగించిన వారికి జీరో బిల్లు వస్తుంది. ఇంకా ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు. రేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి గృహజ్యోతి వర్తిస్తుంది. – రవీందర్, ఎస్ఈ, విద్యుత్‌శాఖ

బీజేపీలో ఇద్దరు కార్పొరేటర్ల చేరిక

- కండువాలు కప్పి ఆహ్వానించిన ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్



ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సమక్షంలో పార్టీలో చేరుతున్న కార్పొరేటర్లు, నాయకులు

సుభాష్‌నగర్: నగరంలోని 17, 37వ డివిజన్ కార్పొరేటర్లు సవితారాజు, ఉమారాణి ముత్యాలుతో పాటు బీఆర్‌ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ మాయావర్ సాయిరాం, పలువురు నాయకులు బీజేపీలో చేరారు. నగరంలోని నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ బానిస సంకెళ్లు తెంచుకొని నరేంద్రమోడీ నాయకత్వంలో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని, 370 ఎంపీ సీట్లు సాధిస్తామన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో మరోసారి కాషాయ జెండా ఎగురవేయడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ పార్టీ క్లోజ్ అవుతుందన్నారు. కార్యక్రమంలో అర్బన్ అసెంబ్లీ కో ఆర్డినేటర్ నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాయకుడు ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేసును 'తుడిచి పెట్టేస్తారా..?'

- ఆర్మూర్ ఘటనపై అనుమానాలెన్నో..
- డీటీని తప్పించేందుకు చక్రం తిప్పుతున్న ఉద్యోగసంఘం నేత
- విచారణ పేరిట కాలయాపన

ట్రాఫిక్ కూడళ్ల వద్ద కారు అద్దాలు తుడుస్తూ డబ్బులు అడుక్కునే వ్యక్తిని కాలితో తన్ని అతడి మృతికి కారణమైన డిప్యూటీ తహసీల్దార్‌ను కేసు నుంచి తప్పించేందుకు ఉద్యోగసంఘం నేత చక్రం తిప్పుతున్నారు. రాజకీయ నాయకుల ద్వారా పోలీసులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. దీంట్లో భాగంగానే కేసును 'తుడిచి పెట్టేందుకు' దారులు వెతుకుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఖలీల్‌వాడి: కారు అద్దం తుడిచి డబ్బులు అడిగిన వ్యక్తిని డిప్యూటీ తహసీల్దార్ ఉద్దేశపూర్వకంగా తనడంతో సదరు వ్యక్తి టిప్పర్ కిందపడి చనిపోయాడు. ఘటన ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలో ఈనెల 22వ తేదీన చోటు చేసుకుంది. సామన్యుడిపై ఫిర్యాదు అందిన వెంటనే నిమిషాల్లో స్పందించే పోలీసులు ఆర్మూర్ ఘటనలో విచారణ పేరిట రోజులు గడుపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యులకు ఓ న్యాయం, పేరున్న వ్యక్తులకు మరోన్యాయమా అనే చర్చ సర్వత్రా కొనసాగుతున్నది.

ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో మంజుల శివరాం(32) అనే వ్యక్తి కారు అద్దాలు తడుస్తూ డబ్బులు అడుక్కునేవాడు. ఎప్పటిలాగే 22వ తేదీన సైతం వాహనాల అద్దాలు తుడుస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడికి చేరిన డిప్యూటీ తహసీల్దార్ కారు అద్దాలను సైతం తుడిచి డబ్బుల కోసం కారు ముందుకు వెళ్లాడు. దీంతో సహనం కోల్పోయిన డీటీ కారులోనుంచి కిందికిదిగి శివరాంను తన్నగా అతడు పక్క నుంచి వెళ్తున్న టిప్పర్ వెనుక టైర్ల కిందపడి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేశారు.





మృతుడు శివరాం (ఫైల్)

రంగంలోకి ఉద్యోగసంఘం నేత

డిప్యూటీ తహసీల్దార్‌ను కేసు నుంచి తప్పించడానికి ఉద్యోగ సంఘం నేత జోరుగా పైరవీలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉద్యోగ సంఘం నేత రంగంలోకి దిగడంతో పోలీసులు సైతం విచారణలో డిప్యూటీ తహసీల్దార్‌ను అదే రోజు విచారించి వదిలేసినట్లు తెలిసింది. ఉద్యోగ సంఘ నేత జోక్యం కారణంగానే పోలీసులు విచారణ పేరిట కాలపయాన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

సోషల్ మీడియాలో సీసీ ఫుటేజీ వైరల్

శివారంను డీటీ తన్నడం, అతడు టిప్పర్ కిందపడి మృతి చెందిన ఘటనకు సంబంధించి సీసీ ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సీసీ ఫుటేజీ స్పష్టంగా ఉన్నప్పటికీ పోలీసులు కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేసుల దర్యాప్తులో సీసీ ఫుటేజీని కీలకంగా భావించే పోలీసులు.. ఈ కేసులో మాత్రం అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. శివరాం మృతికి డీటీ కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆర్మూర్‌పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేయగా, నిందితులకు శిక్షపడేలా చూస్తామని ఎస్‌హెచ్‌వో రవికుమార్ వారికి హామీ ఇచ్చారు.

విచారణ చేస్తున్నాం

ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద జరిగిన ఘటనలో డిప్యూటీ తహసీల్దార్‌పై విచారణ చేస్తున్నాం. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నాం. విచారణలో తేలిన అంశాల ఆధారంగా నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– రవికుమార్, ఎస్‌హెచ్‌వో, ఆర్మూర్

దర్జీల బతుకుల్లో కనిపించని దర్జా



ఈ చిత్రంలో కనిపిస్తున్న దర్జీ గడ్కోల్ గ్రామానికి చెందిన గట్ల స్వామి. ఇప్పటికీ దర్జీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాడు. గత యాభై ఏళ్లుగా దర్జీ వృత్తిలోనే కొనసాగుతున్నాడు. చేతి నిండా పని లేకపోవడంతో వడ్లు ఆరబెట్టుకోవడానికి వినియోగించే తాటిపత్రులు కుడుతూ జీవనం నెట్టుకొస్తున్నాడు.

- 'రెడీమేడ్' కారణంగా పని కరువు
- కనుమరుగవుతున్న టైలర్‌షాపులు
- నేడు టైలర్స్ డే

సిరికొండ: దర్జీల బతుకుల్లో దర్జా కరువైంది. ఒకప్పుడు ఓ వెలుగువెలిగిన టైలర్ వృత్తి.. రెడీమేడ్ దుస్తుల రాకతో క్రమేణా మసకబారుతున్నది. శుభకార్యాలు ఉన్నాయంటే నాటి రోజుల్లో వారం, పది రోజుల ముందు దుస్తులు కుట్టించుకోవానుకునే వారు. దసరా, దీపావళి, రంజాన్, క్రిస్మస్ పండగ ఏదైనా దర్జీలకు చేతినిండా పని ఉండేది. దర్జీలను పల్లెల్లో గౌరవంగా చూడడంతోపాటు వారికి రైతులు తాము సాగు చేసిన పంట దిగుబడులను ప్రేమతో అందించేవారు. ఇదంతా గతం.. రెడీమేడ్ వ్యవస్థ రావడంతో వారి బతుకు ముందుకుసాగడం లేదు. తగినంత పని దొరకక, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వెతుక్కోవాల్సిన దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మరికొందరు గత్యంతరం లేని పరిస్థితుల్లో పని దొరికినా, దొరక్కపోయినా ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు.

కనిపించని దుకాణాలు

రెడీమేడ్ దుస్తులు తక్కువ ధరలో లభిస్తుండటంతో దర్జీలు చాలా మంది తమ వృత్తిని వదులుకుంటున్నారు. గతంలో ప్రతి గ్రామంలో కనిపించిన టైలర్ షాపు ఇప్పుడు కనిపించకుండాపోతున్నాయి. ప్రభుత్వం నుంచి ఒక్క రేషన్ కార్డు తప్ప ఎలాంటి సహాయం లేని చేతి వృత్తుల కులం మేరుకులం ఒకటేనని దర్జీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



దర్జీలను ఆదుకోవడానికి ప్రభుత్వం శ్రద్ధ వహించాలి. 50 ఏళ్లు నిండిన దర్జీలకు పింఛన్లు ఇవ్వాలి. అధునాతన కుట్టుమిషన్లను ఉచితంగా అందజేయాలి. బీసీ–డీలో ఉన్న మమ్మల్ని బీసీ–ఏలోకి మార్చాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరఫరా చేస్తున్న యూనిఫామ్‌లను స్థానికంగా గ్రామాల్లోనే దర్జీల చేత కుట్టిస్తే ఉపాధి దొరుకుతుంది.

– కొక్కు ప్రసాద్, మేరు సంఘం మండలాధ్యక్షుడు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

నిజామాబాద్‌రూరల్: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా గుండారం సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి పనులను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గుండారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించగా.. విజేతలకు పాఠశాలలో మంగళవారం బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం అమర్‌నాథ్ మాట్లాడుతూ.. రైల్వే శాఖ ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ – వికసిత్ రైల్వే' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించడం ఆనందకరమన్నారు. విద్యార్థులకు రైల్వేల మీద అవగాహన కలిగిస్తుందన్నారు. వ్యాసరచన పోటీల్లో డి.మేఘన, తస్నీం ఫిర్దోజ్, కె.సాయి హర్షిత, చిత్రలేఖన పోటీల్లో ఒ.శృతిరెడ్డి, కె.గంగాలక్ష్మి, ఐశ్వర్య, ఉపన్యాస పోటీలో ఆర్.లాస్య, ఎ.కృష్ణవేణి, బి.నిహారిక బహుమతులు అందుకున్నారు. ఉపాధ్యాయులు గిరి ధర్, ఆరోగ్యరాజ్, ప్రణీత, నవీనకుమారి, నాందేవ్, వినోద్ కుమార్, బాల జయంతి, పుష్ప లత, కవిత, పూజ, మోనీశ్ పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

క్లుప్తంగా

హైకోర్టు ఏజీపీగా బెల్లాల్‌వాసి లలిత



బోధన్: బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన గిరిజన సామాజికవర్గ వ్యవసాయ కుటుంబానికి చెందిన మంగురాం నాయక్, కమల దంపతుల కూతురు దాల్వాల్ లలిత హైకోర్టు ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా నియమితులయ్యారు. ఈ ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 24వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె మూడేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. కొన్నేళ్లుగా లలిత హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. తన సేవలను గుర్తించి ప్రభుత్వం ఏజీపీగా నియమించిందని ఆమె మంగళవారం తెలిపారు.

ప్రభుత్వ పథకాల పరిశీలన



బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామాన్ని ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి మంగళవారం సందర్శించారు. స్థానిక అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించిన ట్రైనీ కలెక్టర్ ప్రభుత్వ పథకాల అమలు, పాలన వ్యవహారాల గురించి తెలుసుకున్నారు. పల్లె ప్రగతి పనులు, హరితహారం, ప్రభుత్వ నిధుల ఖర్చులు, రికార్డుల నిర్వహణ తదితర వివరాలు తెలుసుకున్నారు. ఆమెవెంట డీపీవో తరుణ్‌కుమార్, డీఎల్‌పీవో సాయిబాబా, ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, తహసీల్దార్ గంగాధర్, ఏపీవో మధుకర్ తదితరులున్నారు.

ఏఈ వ్యవహారంపై ముగిసిన విచారణ

నిజామాబాద్‌నాగారం: ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసిన ఏఈ రాంసింగ్ వ్యవహారంపై ఏపీటీఎస్ సీఐ, విజిలెన్సు డీఈ ప్రభాకర్ చేపట్టిన విచారణ ముగిసింది. బాధితులు సీఎండీ, ఎస్ఈ, డీఈ, ఏడీఈకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏఈని కాపాడేందుకు కీలక అధికారి ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈ నెల 26న నవీపేట్‌కు వెళ్లి ఏపీటీఎస్ సీఐ గోవర్ధన్, విజిలెన్స్ డీఈ ప్రభాకర్ వేర్వేరుగా విచారణ చేపట్టి జిల్లా అధికారికి నివేదికను అందజేశారు. ఇది వరకే ఏఈపై ఏడీఈ, డీఈ విచారణ చేపట్టి తమ నివేదికలను అందజేశారు. విచారణకు సంబంధించిన వివరాలన్నింటినీ టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీకి పంపించినట్లు తెలిసింది. సదరు అధికారిపై ఏ విధమైన చర్యలు తీసుకుంటారు? బాధితులకు న్యాయం జరుగుతుందా అనే దానిపై సర్వత్రాచర్చ కొనసాగుతోంది.

పశువుల కొవ్వుతో కల్తీనూనె



బాన్సువాడ రూరల్: పశువుల కొవ్వు, ఎముకలతో కల్తీనూనె తయారు చేస్తున్న ఘటన బాన్సువాడలో కలకలం రేపింది. మండల కేంద్రంలోని సంగమేశ్వర కాలనీ రెండో రోడ్డులో ఓ కుటుంబానికి చెందిన వారు ఇంటి దాబాపై పశువుల ఎముకలు, కొవ్వును మరగబెట్టి నూనె తయారు చేస్తుండగా దుర్వాసన రావడంతో స్థానికులు ఆరాతీశారు. పైకి వెళ్లి చూసి కల్తీనూనె తయారు చేస్తున్నట్లు అనుమానంతో బాన్సువాడ పోలీసులకు సమాచారం అందించారు. ఇలాంటి కల్తీనూనెలు ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీ పాయింట్లల్లో విక్రయిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడ్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఏసీ దగ్ధం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని సంగీత మొబైల్ షాప్‌లో మంగళవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్ దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగాయని, వెంటనే దుకాణంలో ఉన్న వారు నీటితో మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి

అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

సుభాష్‌నగర్: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పాత కలెక్టరేట్ మైదానం నుంచి ప్రగతి హాస్పిటల్ వరకు, తిరిగి అక్కడి నుంచి పాత కలెక్టరేట్ మైదానం వరకు 2కే నడక నిర్వహించారు. కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యత ఆవశ్యకతను గుర్తెరిగి, ప్రతిఒక్కరూ అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే ఆస్కారం ఉంటుందన్నారు. ఈ దిశగా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఆర్‌బీఐ ద్వారా నిర్వహిస్తున్న అక్షరాస్యత వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం సూర్యకాంతాదాస్, రీజినల్ మేనేజర్ శ్రీకాంత్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి నవీన్‌కుమార్, ఎన్‌డీసీసీ బ్యాంకు సీఈవో నాగభూషణం, పీఐబీ అధికారి ధర్మానాయక్, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వారోత్సవాల్లో పాల్గొన్న డీసీసీబీ, ఇతర బ్యాంకుల అధికారులు, సిబ్బంది

జాతీయ సెపక్ తక్రాకు ఎంపిక

నిజామాబాదనాగారం: జాతీయస్థాయి సెపక్ తక్రా టోర్నీకి జిల్లా నుంచి ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని సంఘం జిల్లా కార్యదర్శి గాదారి సంజీవరెడ్డి మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల టోర్నమెంట్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో లాస్యప్రియ, మన్విత, బిలాస్య, శ్రీ రిషిత ఎంపికకాగా, జూనియర్ బాలికల విభాగంలో పి శ్రీజ ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో బి ఉదయ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఎంపికైనవారు మార్చి 26 నుంచి 30 వరకు కర్ణాటకలో నిర్వహించే టోర్నీలో పాల్గొంటారు.

ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

- రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

నిజామాబాద్‌అర్బన్: ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. చరిత్రను వక్రీకరిస్తూ కేవలం మనువాద సంస్కృతిని పెంపొందించే దిశగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తున్నాయన్నారు. ప్రజలు కలిసికట్టుగా ఉండి ఈ మనువాద విష సంస్కృతిని పారదోలాలన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతుల మీద జరిగిన దాడులను ఖండించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆయా అంశాలపై దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలు, ముఖ్యమైన విద్యా కేంద్రాలలో ముఖాముఖి చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీలో మార్చి 12న విద్యార్థులతో ముఖాముఖి చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ డెమోక్రటిక్ ఫోరం కన్వీనర్ వినాయక్‌రెడ్డి, జాగో తెలంగాణ కోర్ కమిటీ మెంబర్ ప్రొఫెసర్ పద్మజ, స్టేట్ కమిటీ మెంబర్ నిర్మల, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి



ధర్పల్లిలో ప్రసంగిస్తున్న డీకే అరుణ





ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు



కమ్మర్‌పల్లిలో ర్యాలీ..



ఆర్మూర్‌లో విజయ సంకల్ప యాత్రకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

జిల్లాలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర

భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర మంగళవారం జిల్లాలో కొనసాగింది. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొనగా, కమ్మర్‌పల్లి నుంచి భీమ్‌గల్, ధర్పల్లి, జక్రాన్‌పల్లి, సిరికొండ, ఆర్మూర్ వరకు సంకల్పయాత్ర కొనసాగింది. ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, పైడి రాకేశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

క్రైం కార్నర్

గుర్తుతెలియని యాచకుడి మృతి



ఆస్పత్రిలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో గుర్తు తెలియని యాచకుడు మంగళవారం మృతి చెందాడు. పట్టణంలోని రాజా ఆయిల్ మిల్ ప్రాంతంలో ఓ వ్యక్తి అపస్మారక స్థిలో పడిఉన్నాడని సమాచారం అందడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని అతడిని ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడి వయస్సు 28 నుంచి 30 ఏళ్లు ఉంటుందని, అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పట్టణ పోలీసులను సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి కోరారు.

జానకంపేట్ శివారులో వృద్ధుడి మృతదేహం..

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట శివారులో గుర్తు తెలియని 70 ఏళ్ల వృద్ధుడి మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని బోధన్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలుసుకొనేందుకు విచారణ చేపడుతున్నారు.

ఉరేసుకొని ఫార్మసిస్ట్ ఆత్మహత్య



హరిప్రసాద్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం చెందిన ఓ ఫార్మసిస్ట్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... అల్వాల హరిప్రసాద్ కావేరీ హోటల్ వెనుక ప్రాంతంలో నివాసముంటూ ప్రైవేట్‌కంపెనీలో ఫార్మాసిస్ట్‌గా పని చేస్తున్నాడు. అతడికి 2013 లో దివ్యభారతితో పెళ్లికాగా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, గొడవల కారణంగా దివ్యభారతి కొద్ది రోజులుగా పిల్లలతో కలిసి తల్లిగారింటి వద్ద ఉంటోంది. భార్యాపిల్లలు వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన హరిప్రసాద్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి దత్తాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

మాగిలో అగ్నిప్రమాదం



దగ్ధమైన వంట సామగ్రి

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో నివాసపు రేకుల షెడ్డుతోపాటు గడ్డివాము దగ్ధమయ్యాయి. పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజం సాయిలుకు చెందిన గడ్డివాముకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోగా, గడ్డివాముతోపాటు పక్కనే ఉన్న మామిళ్ల రామవ్వకు చెందిన నివాసపు రేకుల షెడ్డులోని సామగ్రి కాలిబూడిదయ్యాయి. రామవ్వకు రూ.1.10లక్షలు, సాయిలుకు రూ.40వేల ఆస్తినష్టం జరిగింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజయ్య పంచానామా చేశారు. బాధిత కుటుంబాలను మాజీ సర్పంచ్ కమ్మరికత్త అజయ్య పరామర్శించారు.

లోలంలో రెండు గుడిసెలు..



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన గుడిసెలు

ఇందల్వాయి: మండలంలోని లోలంలో మంగళవారం వేకువజామున జరిగిన అగ్ని ప్రమాదంలో సున్నం సత్తెమ్మ, సున్నం భూమయ్యకు చెందిన రెండు నివాసపు గుడిసెలు దగ్ధమైనట్లు తహసీల్దార్ వెంకట్‌రావు తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి గ్యాస్ సిలిండర్ పేలడంతో పక్కనే ఉన్న కందాల ప్రశాంత్ అనే వ్యక్తి ఇళ్లు సైతం పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. బాధితులు సత్తెమ్మ, భూమయ్య వేరే గ్రామానికి వెళ్లారని, వారింట్లో కొద్ది రోజుల క్రితమే వివాహం జరిగిందన్నారు. రూ.లక్ష నగదుతోపా టు, ఫర్నిచర్, ఇతర విలువైన వస్తువులు కాలిపోయాయని తెలిపారు. సుమారు రూ.6లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు, రెవెన్యూ అధికారులు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు

డిచ్‌పల్లి: ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కే మల్లేశ్, ఎస్సై మహేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గొల్లపల్లికి చెందిన హరీశ్ గ్రామానికి చెందిన యువతిని కొన్ని సంవత్సరాలుగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలుచెప్పి నమ్మించి మోసగించాడని పేర్కొన్నారు. తనను పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి తేవడంతో హరీశ్ తప్పించుకు తిరుగుతూ మరో యువతిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధంకావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన కాకి ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కాకి రాకేశ్, బాబుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రమేశ్‌బాబు మంగళవారం తెలిపారు. ప్రశాంత్‌కు రాకేశ్‌తో కల్లు దుకాణంలో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. దీన్నిదృష్టిలో పెట్టుకుని అన్నదమ్ముళ్లు రాకేశ్, బాబు కలిసి ప్రశాంత్ ఇంటికి వెళ్లి కర్రలతో దాడికి పాల్పడ్డారు. దాడిలో ప్రశాంత్ తల్లి ముత్యమ్మకు గాయాలు కాగా, ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రశాంత్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో చైన్‌స్నాచింగ్

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని తిరుమల కాలనీలో సోమవారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. పట్టణంలోని తిరుమల కాలనీలో భూసం రాజన్న అనే వ్యక్తి సోమవారం రాత్రి దుకాణం మూసివేసి ద్విచక్ర వాహనంపై భార్యతో కలిసి వెళ్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఒంటరిగా ఉంటున్న మహిళ హత్య



బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని బండారెంజల్ గ్రామానికి చెందిన గంట బాలవ్వ(50)హత్యకు గురైనట్లు సీఐ జగడం నరేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో బాలవ్వ ఒంటరిగా ఉంటోంది. ఆమె ఇంట్లో నుంచి దుర్వాసన వస్తోందని చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించగా, బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు బాలవ్వ తలపైకొట్టి ఆమెను హత్య చేసినట్లు గుర్తించారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె కూతురు శ్రీకాంతకు సమాచారం అందించారు. గ్రామానికి చెందిన బోడ సాయిలుపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి కూతురు శ్రీకాంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

భిక్కనూరు: మద్యం సేవించి మండలంలో జాతీయ రహదారిపై వాహనం నడుపుతున్న ఒకరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. దోమకొండ మండలం ఫరీద్‌పేటకు చెందిన ఓ వ్యక్తి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడన్నారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అతడికి రెండు రోజుల జైలు శిక్షతోపాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్‌ఎస్ నగర్ పీఎస్ పరిధిలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడగా, రెండో తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ప్రతాప్ అతడికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.200 జరిమాన విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని ఎస్సై సూచించారు.

తాళాలు వేసిన ఇళ్లలో చోరీకి యత్నం

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండల కేంద్రంలో చిల్లర దొంగలు హల్‌చల్ చేశారు. సోమవారం రాత్రి గ్రామంలోని పలు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. ఇళ్లలోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు బీరువాల్లో డబ్బులతోపాటు విలువైన వస్తువులు లభించకపోవడంతో సామన్లను చిందరవందర చేసి వెళ్లిపోయారు. గ్రామస్తుల సమాచారం మేరకు బోధన్ రూరల్ పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు.

కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి

బాల్కొండ: కుక్కలదాడిలో 18 మేక పిల్లలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్ తన మేకల మందను మేతకు తీసుకెళ్తూ పిల్లలను కొట్టంలోనే వదిలేసి వెళ్లాడు. కొట్టంలో ఉన్న మేకపిల్లలపై కుక్కల దాడి చేయడంతో మృతి చెందాయి. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.